

4వ తేదీ నాటికి మళ్లీ సర్దుబాటు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో పదోన్నతుల అనంతరం ఏర్పడిన ఖాళీల భర్తీకి మరో సారి టీచర్ల సర్దుబాటు చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ నెల 4 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని డీఈవోలను పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈమేరకు కసరత్తు ఎంఈవోల ద్వారా ఖాళీల వివరాలతో పాటు ఏ పాఠశాల నుంచి ఉపాధ్యాయులను ఎక్కడికి సర్దుబాటు చేయాలనే సమాచారాన్ని జిల్లాస్థాయి అధికారులు సేకరిస్తున్నారు.

ఇందిరా మహిళా శక్తి షాపులో డీపీఎం విచారణ

రాగిపిండిలో పురుగులు రావడంతో తనిఖీలు



ఇందిరా మహిళా శక్తి చిరుధాన్యాల షాప్‌లో విచారణ జరుపుతున్న డీపీఎం రమేశ్‌బాబు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి కలెక్టరేట్ ఆవరణలోని ఇందిరా మహిళా శక్తి చిరుధాన్యాల దుకాణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ డీపీఎం రమేశ్‌బాబు సోమవారం విచారణ చేశారు. మూడు రోజుల కిందట పట్టణానికి చెందిన ఓవ్యక్తి రాగిపిండిని కొనుగోలు చేయగా పురుగులే రావడంతో ఫుడ్‌సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో, జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి రాజేశ్వర్ తనిఖీ చేయగా లేబుల్స్ లేకుండా విక్రయించడాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు. అయితే ఈ వ్యవహారంపై సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య స్పందించారు. సమగ్ర విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో, డీపీఎం విచారణ చేపట్టారు. ఫుడ్ ఐటెమ్స్‌కు లేబుల్స్ వేయించారు. ఆయన వెంట డీజీఎం లింగమూర్తి ఉన్నారు.

ఇష్టానుసారంగా కేటాయింపు

జిల్లావ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, చిరుధాన్యాలు, పార్లర్ దుకాణాలను మహిళా సంఘాల సభ్యులకు ఇష్టానుసారంగా కేటాయించారనే ఆరోపణలున్నాయి. ఒకరికి కేటాయిస్తే నిర్వహణ బాధ్యత మరొకరి అప్పగించినట్టు తెలిసింది. గ్రామీణ ప్రాంతాలవారి కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పట్టణ ప్రాంతాల వాసుల కోసం మెప్మాశాఖ ఇందిరా మహిళాశక్తి పేరిట క్యాంటీన్లు కేటాయించింది. ఈరకంగా జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ శాఖ తరుపున ఐదు, మెప్మా తరుపున నాలుగు దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. అయితే, ఆయా దుకాణాల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా కేటాయించారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లపై సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్‌ను ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

రాంమందిర్ గణపయ్య సన్నిధిలో సంగీత విభావరి

కాంగో డ్రమ్స్ వాయిస్తూ భక్తిగీతాలు ఆలపించిన జగ్గారెడ్డి



కాంగో డ్రమ్స్ వాయిస్తూ భక్తిగీతాలు ఆలపిస్తున్న జగ్గారెడ్డి

సంగారెడ్డి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి పట్టణంలోని రాంమందిర్ వద్ద టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపయ్య సన్నిధిలో ఆదివారం రాత్రి సంగీత విభావరి నిర్వహించారు. సినీ నేపథ్య గాయకులు పాల్గొని తమ గాత్రంతో ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. జగ్గారెడ్డి స్వయంగా కాంగో డ్రమ్స్ వాయిస్తూ భక్తి గీతాలు ఆలపించారు.



సంగీత విభావరికి హాజరైన గాయకులతో జగ్గారెడ్డి

'ఇన్‌స్పైర్' కావట్లే

మెదక్ జిల్లాలో ఇన్‌స్పైర్ మనక్‌కు కరువైన స్పందన

జిల్లాలో 240 స్కూళ్లు.. నమోదు చేసుకున్నవి 25 మాత్రమే

లక్ష్యానికి దూరంగా రిజిస్ట్రేషన్లు

ఈ నెల 15 వరకు గడువు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనలను ప్రోత్సహించేందుకు నిర్వహించే 'ఇన్‌స్పైర్ మనక్' అవార్డుల దరఖాస్తు ప్రక్రియలో మెదక్ జిల్లా విద్యార్థులు వెనుకబడి ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్రసాంకేతికశాఖ (డీఎస్‌టీ), నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్(ఎన్‌ఐఎఫ్) ద్వారా ప్రతీ సంవత్సరం ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం నిర్వహిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, గురుకులాల్లో 6-10 తరగతుల విద్యార్థుల నమూనాలను ప్రదర్శించే అవకాశం కల్పిస్తారు. ఒక్కో పాఠశాలల నుంచి ప్రాజెక్టుల రూపకల్పనకు ఐదు చొప్పున నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఎంపికైన విద్యార్థులకు వారి ప్రాజెక్టుల తయారీ కోసం రూ. 10వేల ఆర్థిక సహాయం లభిస్తుంది. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ. 25వేల బహుమతితో పాటు, జపాన్ వంటి దేశాలను సందర్శించే అవకాశం కూడా లభిస్తుంది.

నామినేషన్ల ప్రక్రియ ఇలా..

హెచ్‌టీటీపీఎస్//డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌స్పైర్ అవార్డ్స్-డీఎస్‌టీ.గౌట్.ఇన్ ద్వారా లేదా గూగుల్ ప్లేస్టోర్‌లో ఇన్‌స్పైర్ మనక్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. స్కూల్ అథారిటీ ద్వారా యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో లాగిన్ అయ్యి విద్యార్థుల ఆవిష్కరణ వివరాలను నమోదు చేయడంతోపాటు నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. హెచ్ఎంలు, గైడ్ టీచర్ల సహకారంతో విద్యార్థులతో ప్రాజెక్టులకు సంబంధించి నామినేషన్లు పంపిచాలి. విద్యార్థి సృజనాత్మక ఆలోచన లేదా ప్రాజెక్టు సంక్షిప్త నివేదిక 2వేల పదాలకు మించకూడదు. విద్యార్థి ఆధార్ కార్డుతో అనుసంధానించిన ఏదైనా జాతీయ బ్యాంకు లేదా పోస్టాఫీస్ ద్వారా జారీ చేసిన పొదుపు ఖాతా పాస్‌పుస్తకం, విద్యార్థి పాస్‌ఫోటో, వివరాలు, ఫోన్ నంబర్, గైడ్‌టీచర్ వివరాలు పొందుపర్చాలి. జిల్లాలో ఇప్పటికే అన్ని యాజమాన్యాల పాఠశాలల హెచ్ఎంతో కలెక్టర్, డీఈవో, డీఎస్‌వో సమావేశాలు నిర్వహించారు. ఇన్‌స్పైర్ అవార్డులకు నామినేషన్లు చేయించాలని ఆదేశించారు. సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో టెక్నికల్ టీంలు కూడా ఏర్పాటు చేశారు.

25 పాఠశాలలు, 82 నామినేషన్లు

జిల్లాలో మొత్తం 240 పాఠశాలలు ఉండగా, కేవలం 25 పాఠశాలలు మాత్రమే ఈసారి పథకంలో నమోదు చేసుకున్నాయి. జిల్లాలో 1,200 నామినేషన్లు నమోదు చేయాలని లక్ష్యం ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు కేవలం 82 నామినేషన్లు మాత్రమే నమోదయ్యాయి. దీనితో రాష్ట్రంలో జిల్లా 15వ స్థానంలో నిలిచింది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆసక్తి చూపకపోవడమే జిల్లా వెనుకబాటుకు కారణమని తెలుస్తోంది. ముఖ్యంగా సైన్స్ టీచర్లు శ్రద్ధ వహిస్తే నామినేషన్లు పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకు 'ఇన్‌స్పైర్' చక్కటి వేదిక. అన్ని యాజమన్యాల పాఠశాలలు తమ విద్యార్థులను ప్రదర్శనల కోసం ప్రోత్సహించాలి. ఈ విద్యాసంవత్సరంలో జిల్లావ్యాప్తంగా నామమాత్రంగానే నామినేషన్లు వచ్చాయి. హెచ్‌ఎంలు, సైన్స్ టీచర్లు ఇకనైనా శ్రద్ధ తీసుకొని 15 లోపు విద్యార్థులతో నామినేషన్లు వేయించాలి.

-రాజిరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, మెదక్

బకాయి బిల్లులు వచ్చేనా?



● మాజీ సర్పంచ్‌లు, కార్యదర్శుల ఎదురుచూపులు ● సంగారెడ్డి జిల్లాలో రూ.50 కోట్లు పెండింగ్

సంగారెడ్డి జిల్లాలోని మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తమ బకాయి బిల్లుల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం 20 నెలల క్రితం ముగిసినప్పటికీ గ్రామాల్లో వారు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇంకా చెల్లించలేదు. జిల్లాలో మాజీ సర్పంచులకు రూ.22 కోట్లు పెండింగ్ ఉండగా.. గత 20 నెలల్లో కార్యదర్శులు చేసిన ఖర్చులు రూ.28 కోట్లు కూడా రావాల్సి ఉన్నది. గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగకపోవడంతో కేంద్రం నుంచి నిధులు నిలిచిపోయాయి. దీంతో, అటు మాజీ సర్పంచులు, ఇటు పంచాయతీ కార్యదర్శులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, తమ బకాయిలు చెల్లిస్తారా లేదా అనే ఆందోళన వారిలో నెలకొంది.

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినా బిల్లుల బకాయిల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. పంచాయతీల్లో గత పాలకవర్గాలు 2019 జనవరిలో బాధ్యతలు చేపట్టగా 2024 జనవరితో వారి పదవీకాలం పూర్తయింది. గ్రామాల్లో ఆయా స్కీమ్‌ల కింద అభివృద్ధి పనులు చేసినప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క పైసా అందక పోవడంతో తాజా మాజీ సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి పనులు చేయడంతో వడ్డీల భారం పెరిగిపోతుండటంతో కుదేలవుతున్నారు. పూర్తిచేసిన పనులకు సంబంధించిన బిల్లుల కోసం రెండేళ్ల క్రితము పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు 12 శాతం వరకు కమీషన్లు ఇచ్చి ఎంబీ రికార్డులు రాయించి 'ఈ-కుబేరా' యాప్‌లో నమోదు చేయించినట్లు తెలుస్తున్నది. అయితే, సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినా బిల్లులు రావడం లేదు. అనంతరం బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా ఇప్పటికీ అందలేదు. దీంతో, కార్యదర్శులు లబోదిబోమంటున్నారు.

మాజీలకు రావాల్సింది రూ.22 కోట్లు

సంగారెడ్డి జిల్లాలోని 647 గ్రామ పంచయతీల్లో తాజా మజీ సర్పంచ్‌లు పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బకాయిలు రూ.22.06 కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉన్నది. గ్రామాల్లో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ సీసీ డ్రైనేజీ, మోటర్ పంపుసెట్ల మరమ్మతులు, పైపులైన్లు, వీధిదీపాలు, గిరిజన తండాలకు మట్టిరోడ్లుతో పాటు పారిశుధ్య నిర్వహణ, ట్రాక్టర్లలో డీజీల్, డ్రైవర్ల వేతనాలు తదితర ఖర్చులకు వెచ్చించారు. జిల్లాలోని 647 గ్రామ పంచయతీల్లో 2019-20 నుంచి 2024 వరకు పూర్తి చేసిన 4,054 పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులు రాయించి 'ఈ-కుబేరా' యాప్‌లో నమోదు చేయించారు. అయితే 12 శాతం కమీషన్లు ఇచ్చిన వారికి మాత్రమే టోకెన్లు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. టోకెన్లు అందుకున్న తాజా మాజీ సర్పంచ్‌లు చెల్లింపులు జరుగుతాయో లేదోనన్న ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శులు ఖర్చు చేసింది రూ.28 కోట్లు

జిల్లాలోని సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత 2024 జనవరి నుంచి ప్రత్యేక అధికారులకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. వీరి ఆదేశాల మేరకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అన్నీ తామై అభివృద్ధి పనుల్లో బాగస్వాములయ్యారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, సిబ్బందికి వేతనాలు

మిగతా 8వ పేజీలో

రోడ్డెక్కిన రైతులు

యూరియా కోసం తిప్పలు
టోకెన్ల కోసం పడిగాపులు
సరిపడా నిల్వలు లేక నిరాశ
ఆగ్రహంతో ఆందోళనబాట

7



శివ్వంపేట రైతు వేదిక వద్ద యూరియా కోసం రైతుల క్యూ

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజలకు అండగా నిలిచేందుకే
'ప్రజావాణి' నిర్వహణ
సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

7

పాత పెన్షన్ సాధించే వరకు పోరాటం

చార్మినార్ జోన్ సాధనకు
త్వరలోనే ఉద్యోగులతో సభ
జేఏసీ చైర్మన్ దొంత నరేందర్

7



7

ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మెడికల్ కాలేజీ పరిపాలనా భవనం

ముహూర్తం ఖరారు

4న మెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్, క్యాన్సర్ వార్డు ప్రారంభం
రూ.273.40 కోట్లతో 500 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన
హాజరుకానున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ
ఏర్పాట్లు పరిశీలించిన అదనపు కలెక్టర్, అధికారులు

జోగిపేట ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

జోగిపేట ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. సోమవారం కావడం, వాతావరణంలో మార్పుల కారణంగా వైరల్ ఫీవర్‌లు వ్యాపిస్తుండటంతో ఆస్పత్రికి 600 మందికి పైగా పేషెంట్లు వచ్చారు. వీరిలో చాలామందికి రక్త పరీక్షలు చేయాల్సిరావడంతో రద్దీ నెలకొన్నది. ఒక్కో పేషెంట్‌కు పది నిమిషాల సమయం పట్టడంతో రోగులు నిరీక్షించాల్సి వచ్చింది. ఉదయం వైద్యులు సకాలంలో రాకపోవడంతో రోగులు చాలా ఇబ్బందిపడ్డారు. మధ్యాహ్నమే వైద్యులు వెళ్లిపోగా ఫార్మసీ కూడా మూసేశారు. దీంతో, రోగులు అసహనం వ్యక్తంచేశారు.

-జోగిపేట (ఆంధ్రజ్యోతి)





బోర్పట్లలోని మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌లో మందు పార్టీ చేసుకుంటున్న అధికారులు

మిషన్ భగీరథ ఫిల్టర్ బెడ్‌లో అధికారుల మందు పార్టీ

హత్నూర, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్‌లో అధికారులు మందు పార్టీ చేసుకోవడం కలకలం రేపింది. విషయం తెలిసిన గ్రామస్థులు వారిని నిలదీశారు. మూడు రోజులుగా నియోజకవర్గంలోని పలు మండలాలకు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గ్రిడ్ అధికారులు మాత్రం కార్యాలయంలో మందు పార్టీ చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. మండలంలోని బోర్పట్లలో సోమవారం సాయంత్రం మిషన్ భగీరథ గ్రిడ్ కాంట్రాక్టు అధికారులు మందు పార్టీ చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయ్యాయి. దీనిపై గ్రామస్థులు వారిని నిలదీశారు. సాయంత్రం తర్వాత మందు పార్టీ చేసుకున్నామని, ఎవరినీ ఇబ్బంది పెట్టలేదని మంజీర నీటి సరఫరా గ్రిడ్ కాంట్రాక్టు మేనేజర్ జగపతిబాబు ఒప్పుకున్నట్లు స్థానికులు తెలిపారు. ప్రజలు తాగేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం ఫిల్టర్ బెడ్ కార్యాలయంలోనే పార్టీ చేసుకోవడం అధికారుల బరితెగింపునకు నిదర్శనమని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.



పాపన్నపేట: మిన్పూర్ గ్రామంలో చెరువులను తలపిస్తున్న వరి పొలాలు

మంజీర ఉగ్రరూపం

● సింగూరు ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద ఉధృతి ● ఏడు గేట్లు ఎత్తి నీటి విడుదల

ఫుల్‌కల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. ఎగువన కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భారీగా వరద నీరు చేరుతోంది. సోమవారం సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 79,814 క్యూసెక్కులుగా నమోదైంది. ఏడు గేట్ల ద్వారా 74,049 క్యూసెక్కులు, జల విద్యుత్ ఉత్పత్తి గేటు ద్వారా 1,499 క్యూసెక్కులు సహా మొత్తం 76,088 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో నమోదైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 19.919 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయి. వరద తగ్గుముఖం పట్టడానికి మరో వారం పట్టవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మంజీర నది ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో నది పరివాహక ప్రాంతంలో సాగవుతున్న పంటలన్నీ జల దిగ్బంధంలోనే ఉన్నాయి.

నాలుగు రోజులు గడిచినా లభించని మల్లాగౌడ్ ఆచూకీ

పుల్‌కల్: చౌటకూర్ మండలం శివంపేట గ్రామానికి చెందిన బడంపేట మల్లాగౌడ్ (45) మంజీర నదిలో గల్లంతై నాలుగు రోజులు గడుస్తున్నా ఇంకా ఆచూకీ లభించలేదు. ఆగస్టు 29న మద్యం మత్తులో వంతెన పైనుంచి నదిలోకి దూకినట్లు పోలీసులు తెలిపారు. భారీ వరద ప్రవాహం ఉండటంతో గాలింపు చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు డ్రోన్, ఎయిర్ బోట్లతో గాలిస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వరద తగ్గితేనే ఆచూకీ లభించే అవకాశం ఉందని పుల్కల్ ఎస్ఐ విశ్వజన్ తెలిపారు.

వరదలో వందలాది ఎకరాలు

పాపన్నపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మంజీర నది, దాని చుట్టుపక్కల వాగులు ఉప్పొంగడంతో పాపన్నపేట

మిగతా 8వ పేజీలో



పెద్దశంకరంపేట మండలం దానంపల్లిలో కోతకుగురైన రహదారిని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్




వద్దన్నా వినకుండా..!

ఇటీవల వరదలకు రామాయంపేట-సిద్దిపేట హైవేపై పలు కల్వర్టును మూసేశారు. రామాయంపేట వద్ద ఉన్న ఓ వంతెన పగుళ్లబారి ఎప్పుడు కూలుతుందో తెలియకుండా ఉండటంతో పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. కానీ, ద్విచక్రవాహనదారులు మాత్రం ఇదేమీ పట్టనట్లు బారికేడ్లను తొలగించుకుని మరీ వెళ్తున్నారు.

-రామాయంపేట (ఆంధ్రజ్యోతి)




విజయవంతమైన 6వ వారం
సంధ్య 70 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GEETHA FILM DISTRIBUTERS

BLOCK BUSTER HIT


SUPER HIT నేడే చూడండి


దేవి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

SUPER HIT నేడే చూడండి


సప్తగిరి 70 - ఆర్.టి.సి.క్రాస్‌రోడ్స్ 11.00,2.00,6.00,9.00
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound
GLOBAL CINEMAS RELEASE

సెప్టెంబర్ 5న బ్రహ్మాండమైన విడుదల


SRI SAI VISUVAL HOUSE 9849153511/ 7013388396/ 9849241458



సంధ్య 35 - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్ 11.00,2.30,6.00,9.30
Enjoy 4k Laser Projection & Dolby Atmos Sound



హిందీ వెర్షన్

మృత్యువును జయించిన బాలిక

● కోమాలోకి వెళ్లిన శ్రీజ ● యాంటీ స్నేక్ వీనమ్ ఇంజక్షన్ ఇచ్చి కాపాడిన వైద్యులు

సిద్దిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విషపూరితమైన కట్లపాము కాటు వేయడంతో పది రోజుల పాటు అపస్మారక స్థితిలోకి వెళ్లిన ఓ పదేళ్ల బాలికకు, సిద్దిపేట జీజీహెచ్ వైద్యులు మెరుగైన వైద్య సేవలనందించి చివరికి బాలిక ప్రాణాలను కాపాడారు. ఈ మేరకు పదేళ్ల బాలిక శ్రీజను సోమవారం డిశ్చార్జి చేశారు. చిన్నకోడూరు మండలం రామంచ గ్రామానికి చెందిన గంగరవేని శ్రీనివాస్, అంజలి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో రెండవ కూతురు శ్రీజ (10) ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. జూలై 31న అర్ధరాత్రి శ్రీజ కుడి చేతిపై కట్లపాము కాటు వేసింది. కుటుంబ సభ్యులు వెంటనే పాపను సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. హెచ్‌వోడీ డాక్టర్ సురేష్‌బాబు, అనస్థీషియా విభాగ వైద్యుడు డాక్టర్ చందర్ శ్రీజ శరీరంలోకి విష ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు పలు పరీక్షల ద్వారా గుర్తించారు. అప్పటికే పాప అపస్మారక స్థితిలోకి వెళ్లడం, నరాలు బలహీనత, గుండె, మెదడుపై తీవ్ర విష ప్రభావం వల్ల మాట్లాడలేకపోయినట్లు గుర్తించారు. సరైన కండీషన్‌లో లేని శ్రీజకు సీపీఆర్ చేసి 10 రోజుల పాటు వెంటిలేటర్‌పై ఉంచి, ప్రతిరోజు అబ్జర్వేషన్ చేస్తూ, మెరుగైన వైద్య సేవలలో భాగంగా సుమారు 60 డోసుల వరకు ఏఎస్‌వీ (యాంటీ స్నేక్ వీనమ్) ఇచ్చారు. పది రోజుల తర్వాత బాలిక కాస్త కోలుకోవడంతో వెంటిలేటర్ తొలగించి చికిత్స అందిస్తూ 30 రోజుల పాటు వైద్య చికిత్స అందించారు. బ్రెయిన్ సిటీ స్కాన్, ఎంఆర్ఐ, ఫిజియోథెరపీ వంటి వైద్యం అందించడం వల్ల ప్రస్తుతం బాలిక ఆరోగ్యంగా ఉందని, ఈమేరకు డిశ్చార్జి చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. దీంతో ఆ వైద్యబృందం చేసిన కృషికి అటు తల్లిదండ్రులే కాకుండా శ్రీజతో పాటు పలువురు వైద్య బృందానికి అభినందనలు తెలిపారు.


శ్రీజతో వైద్య బృందం, కుటుంబ సభ్యులు

డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డికి అరుదైన పురస్కారం


కలకుంట్ల రాజేశ్వర్ రెడ్డిని పురస్కారంతో సత్కరిస్తున్న శ్రీ శ్రీ కళావేదిక సభ్యులు

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సిద్దిపేటకు చెందిన ప్రముఖ జ్యోతిషుడు, కవి డాక్టర్ కలకుంట్ల రాజేశ్వర్‌రెడ్డికి మరోసారి అరుదైన గౌరవం దక్కింది. ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా నరసరావుపేటలో అంతర్జాతీయ సాంస్కృతి సంస్థ శ్రీ శ్రీ కళావేదిక వారు తెలుగు భాషా దినోత్సవ సందర్భంగా ఆదివారం రాత్రి సాహితీ సభ నిర్వహించారు. సాహితీ సభలో సిద్దిపేటకు చెందిన డాక్టర్ కలకుంట రాజేశ్వర్ రెడ్డి తెలుగు సాహిత్య రంగంలో చేసిన విశేష సేవలను గుర్తించి గజమాలతో సత్కరించారు. అనంతరం తెలుగు భాషా సేవ విశిష్ట తెలుగుతేజం పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక మేనేజింగ్ డైరెక్టర్ డా.కత్తిమండ ప్రతాప్ , ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ అధ్యక్షులు కోటేశ్వర్ రావు , జాతీయ మహిళా అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణంలు పాల్గొన్నారు .ఈ సందర్భంగా సిద్దిపేటలో పలువురు డాక్టర్ రాజేశ్వర్ రెడ్డిని ప్రశంసించారు.

ఇద్దరి అదృశ్యం

పటాన్‌చెరు సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ యువతి, ఓ బాలిక అదృశ్యం అయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సుభాష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామంలో నివాసం ఉంటున్న భాగ్యలక్ష్మి గత నెల 30వ తేదీన ఉదయం 9.30 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో అన్న సంతోష్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బాలిక అదృశ్యం


శాంతి(ఫైల్)

రామేశ్వరంబండ గ్రామంలో నివాసం 14ఏళ్ల శాంతి అనే బాలిక సోమవారం మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికారు. బంధువుల ఇళ్లల్లో విచారించారు. ప్రయోజనం లేకపోవడంతో తల్లి పెంటమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పనులు చేస్తూ జారిపడ్డ తాపీ మేస్త్రి

నిజాంపేట, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): నాలుగో అంతస్తులో నిర్మాణ పనులు చేస్తూ ఓ తాపీ మేస్త్రి జారి కిందపడ్డాడు. దీనిలో అతని రెండు కాళ్లు విరిగాయి. ఘటన మండల పరిధి నందిగామలో సోమవారం చోటుచేసుకుంది. అతడు గత ఏడు కూడా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చాలా రోజుల తర్వాత కోలుకున్నాడు. అయితే ఈ సాయంత్రం చర్చి నిర్మాణ పనులు చేస్తూ అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యాడు. అతడిని మెరుగైన వైద్యం కోసం.. ఆస్పత్రికి తరలించారు.

దోపిడీ దొంగల బీభత్సం

● ఇంట్లో చొరబడి నగదు, బంగారం అపహరణ

జహీరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): దోపిడీ దొంగలు ఇంట్లో చొరబడి బంగారం, వెండి, నగదును అపహరించుకుపోయిన సంఘటన శనివారం రాత్రి పట్టణంలోని ఆదర్శనగర్ సెకండ్‌వెంచర్‌లో జరిగింది. పట్టణ ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పెంటయ్య కుటుంబసమేతంగ ఆగస్టు30న ఇంటికి తాళంవేసి బంధువుల వద్దకు వెళ్లాడు. ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటితాళం పగులగొట్టడంతో పాటు, ఇంట్లోగల బీరువా, తదితరాల తాళాలను పగులగొట్టి అందులోగల వివిధరకాల వస్తువులను చిందర వందరగ పడవేశారు. దీంతో పెంటయ్య, ఆయన కుటుంబసభ్యులు తమను ఆశ్రయించగ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీంని రప్పించి వేలిముద్రలను సేకరించామన్నారు. రెండు తులాలబంగారం, 5తులాలవెండి, రూ.10వేల నగదును దోపిడీ దొంగలు దోచుకెళ్లారన్నారు. వీటి విలువ సుమారు 2.20లక్షల వరకు ఉంటుందన్నారు. బాధితుల ఫిర్యాదుమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

2020లో కూడా ఇదే ఇంట్లో దొంగతనం

2020-మార్చిలో సంవత్సరంలో మున్సిపల్ ఉద్యోగి పెంటయ్య ఇంట్లో దోపిడీ దొంగలు చొరబడి ఇదేతరహాలో చోరికి పాల్పడి 9తులాల బంగారం, రూ.20వేలు ఎత్తుకెళ్లారు. దీంతో అప్పట్లో తాము పోలీసులను ఆశ్రయించగా వారు చోరీసొత్తును రికవరిచేసి తమకు కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చారని బాధితులు వాపోయారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో విచారణచేపట్టి చోరీ చేయబడిన సొత్తును తమకు అప్పగించేలా చూడాలని బాధితులు పోలీసులను కోరుతున్నారు.


మున్సిపల్ ఉద్యోగి ఇంట్లో చిందరవందరగా పడవేసిన వస్తువులను పరిశీలిస్తున్న ఎస్సై వినయ్‌కుమార్

పేకాటరాయుళ్ల అరెస్ట్

జహీరాబాద్, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలోని మస్తాన్‌కాలనీలో సోమవారం పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నగదు, మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనంప్రకారం.. మస్తాన్‌కాలనీలో పేకాట ఆడుతున్న సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. దీంతో అక్కడికి వెళ్లి చూడగా నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని, వారివద్ద రూ.15,800 నగదు, 4మొబైల్‌ఫోన్లు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను అరెస్టుచేసి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

నెల రోజుల్లో 167 మొబైల్ ఫోన్ల రికవరీ


బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించిన మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనానికి గురైన 167 మొబైల్ ఫోన్లు(రూ.25 లక్షల విలువ)ను గుర్తించి, నెల రోజుల్లోనే వాటిని బాధితులకు సోమవారం జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈఏడాది జనవరి నుంచి ఆగస్టు 31 వరకు జిల్లా పరిధిలో మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న 1264 మొబైల్ ఫోన్ల(రూ.1.89 కోట్ల విలువైన)ను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు. ఫోన్లు పోగొట్టుకున్నవారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. చోరీ జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా దొంగతనమైన మొబైల్ ఫోన్‌లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించవచ్చని, ఇది ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రగతిశీల టెక్నాలజీపై ఆధారపడిన ఒక గొప్ప సాధనమని తెలిపారు. ప్రజలు, వినియోగదారులు సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తే.. ఆ దుకాణ యాజమాని నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజల కోసం పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలు వస్తే పోలీసు సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మొబైల్‌ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్పీతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ మధు సూదన్‌గౌడ్, ఐటీకోర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

మనూరు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా మనూరు మండలంలోని ఓ వ్యక్తి కమలాపూర్ చెరువులో పడి గల్లంతయ్యాడు. చేపలు పట్టేందుకు శనివారం మధ్యాహ్నం నారాయణఖేడ్ పట్టణానికి చెందిన ఐదుగురు యువకులు మహమ్మద్, సుదీర్, సందీప్, అద్నాన్, లతీఫ్‌లు చెరువు వద్దకు చేపలు పట్టేందుకు వెళ్లగా, వారిలో లతీఫ్(28) అనే యువకుడు చెరువులో పడి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. స్థానిక పోలీసులు, రిస్క్యూటీం కలిసి వెతుకగా శనివారం రాత్రి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నారాయణఖేడ్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపారు.

ఫౌంటేన్‌ను ఢీకొని వ్యక్తి..

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బీజేఆర్ చౌరస్తా ఫౌంటేన్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. టూ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన ఆకుల శశిధర్ (21) సెలెక్ట్ మొబైల్ షోరూంలో పనిచేస్తుంటాడు. ఆదివారం రాత్రి మొబైల్ షాప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక నిమజ్జనం తర్వాత ఆకుల శశిధర్ తన గ్రామానికి స్పోర్ట్స్ బైక్ పై వెళ్తున్న క్రమంలో బీజేఆర్ చౌరస్తా ఫౌంటెన్‌ను ఢీకొని ఫౌంటెన్ లోపల పడిపోయాడు. ఫౌంటేన్ లోపలికి ఉండడంతో బయట నుంచి ఎవరికీ కనపడలేదు. సోమవారం సాయంత్రం ఆ చౌరస్తాలో పెద్ద గూడ్స్ వాహనం వెళ్తుండగా ఆ వాహనం పైన కూర్చున్న వ్యక్తి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

గుర్తుతెలియని శవం లభ్యం

సిద్దిపేట క్రైం సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు బాలాజీ గార్డెన్స్ శివారులో గుర్తుతెలియని మృతదేహం లభ్యం అయింది. వన్ టౌన్ సీఐ వాసుదేవ రావు కథనం ప్రకారం.. ఆ వ్యక్తి వయసు 40 సంవత్సరాలు ఉంటుందని, మూడు నాలుగు రోజుల క్రితం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అంచనా వచ్చినట్లు తెలిపారు. వ్యక్తి మృతి చెంది నాలుగు రోజులు గడుస్తున్నందున మృతదేహం కుళ్లి పోయినదని ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉన్నదని తెలిపారు. వ్యక్తి బ్లాక్ ఫైయింటు, వైట్ కట్ బనియన్, బయటకు గ్రే కలర్, లోపల ఆరెంజ్ కలర్ గల స్వెటర్ ధరించి ఉన్నట్లు తెలిపారు. దేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చూరి లో భద్రపరిచినట్లు తెలిపారు. ఎవరైనా మృతదేహాన్ని గుర్తు పట్టినట్లు అయితే సిద్దిపేట వన్ టౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

పాత పెన్షన్ సాధించే వరకు
నిర్విరామ పోరాటం

● చార్మినార్ జోన్ సాధనకు త్వరలోనే ఉద్యోగులతో బహిరంగ సభ
● జేఏసీ చైర్మన్ దొంత నరేందర్


అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ చైర్మన్ దొంత నరేందర్, ఉద్యోగులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నూతన పెన్షన్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ సాధించే వరకు నిర్విరామ పోరాటం చేస్తామని జేఏసీ చైర్మన్ దొంత నరేందర్ తెలిపారు. పెన్షన్ విద్రోహ దినంగా పరిగణిస్తూ.. సీపీఎస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నాకు దిగారు. ఉద్యోగుల నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం అమలైన 21 ఏళ్లల్లో సీపీఎస్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అంతేకాకుండా పదవీ విరమణ అనంతరం ఉద్యోగులకు భద్రతనిచ్చే పెన్షన్ లేకపోవడంతో చాలా మంది విశ్రాంత సీపీఎస్ ఉద్యోగులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ముందు ఏ ఒక్క ఉద్యోగి నష్టపోకుండా పాత పెన్షన్ విధానం అమలులోకి తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జిల్లాను రాజన్నజోన్‌లో కలపడం వల్ల చదువుల్లో విద్యార్థులకు, నియామకాల్లో నిరుద్యోగులకు, పదోన్నతుల్లో ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. చార్మినార్ జోన్ సాధనకై త్వరలో అన్ని వర్గాల ఉద్యోగులతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి విఠల్, టీఎన్జీవో, టీజీవో, ట్రెస, ఎస్టీయూ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజ్‌కుమార్, నాగభూషణం, మహేందర్‌గౌడ్, రాజ్‌గోపాల్‌గౌడ్, పద్మారావు, చరణ్‌సింగ్, వివిధ సంఘాల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసే వరకు ఉద్యమం ఆగదు : జేఏసీ



సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని అమలు చేసే వరకు ఉద్యమాన్ని ఆపేదిలేదని తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. ఉద్యోగుల పెన్షన్ హక్కుని హరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షన్ పొందడం ఉద్యోగుల హక్కు అని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దయా దాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండదని స్పష్టం చేశారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అన్నారు. రాజకీయ నాయకులు కేవలం 5 సంవత్సరాలు సేవలందించినందుకే ఎమ్మెల్యే, ఎంపీలకు పెన్షన్లు ఇస్తున్న ప్రభుత్వాలు 40 సంవత్సరాలు సేవలందించిన ఉద్యోగులకు పెన్షన్లు ఇచ్చేందుకు అభ్యంతరమేమిటని వారు ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ఉద్యోగుల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్, టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు జావెద్ అలీ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, జేఏసీ నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడికి 51 రకాల నైవేద్యం

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి పట్టణం చాణక్యపురి కాలనీలో వినాయక నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాలనీ వాసులంతా కలిసి సోమవారం 51 రకాల వంటకాలతో నైవేద్యాన్ని సమర్పించారు. అనంతరం భక్తులు కోలాటం ఆడి సందడి చేశారు.

రోడ్డెక్కిన రైతులు

యూరియా కోసం తప్పని తిప్పలు
టోకెన్ల కోసం పడిగాపులు
సరిపడా నిల్వలు లేక నిరాశ
ఆగ్రహంతో ఆందోళనబాట


హుస్నాబాద్ సహకార సంఘం ఎదుట రాస్తారోకో చేస్తున్న రైతులు


రాయపోల్‌లో ధర్నా చేస్తున్న రైతులు

హుస్నాబాద్/మద్దూరు/రాయపోలు/జగదేవ్‌పూర్/కుకునూరుపల్లి/కొండపాక/మనోహరాబాద్/రామాయంపేట/శివ్వంపేట/చిన్నశంకరంపేట/తూప్రాన్/చేగుంట/నర్సాపూర్/కంది, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) :యూరియా కొరత రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. సోమవారం మెదక్, సిద్దిపేట జిల్లాల్లో తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాచిన రైతులకు నిల్వలు లేవని మళ్లీ రావాలని అధికారులు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఆందోళన బాట పట్టారు. రోడ్డు బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

● హుస్నాబాద్‌లో రైతులు తెల్లవారుజామునే సహకార సంఘం ముందు క్యూలో నిల్చున్నారు. గంటల తరబడి వేచి ఉన్నా యూరియా సరఫరా చేయకపోవడంతో మండిపడిన రైతులు పట్టణంలోని మన ఆగ్రోస్, సహకార సంఘం ముందు హన్మకొండ, సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దాదాపు రెండు గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బీఆర్ఎస్ నాయకులు కూడా నిరసనలో పాల్గొన్నారు. వ్యవసాయ అధికారులు, పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● మద్దూరులో యూరియా టోకెన్ల పంపిణీలో సమాచార లోపం వల్ల రైతులు గందరగోళానికి గురయ్యారు. మండల కేంద్రంలోని సొసైటీ క్యాష్ కౌంటర్ వద్ద టోకెన్లు అందిస్తున్నట్లు తెలిసి రైతులు అక్కడికి పెద్దఎత్తున క్యూ కట్టారు. అంతలోనే రైతువేదికకు మార్చడంతో అధికారులను నిలదీశారు. 1050 బస్తాలు రాగా, కేవలం 535 మంది రైతులకు మాత్రమే యూరియా అందడంతో మిగతా వారు ఆగ్రహం వ్యక్తం చేసి ధర్నా నిర్వహించారు.

● జగదేవ్‌పూర్‌లో 450 బస్తాల యూరియా రాగా, పీఏసీఎస్ కేంద్రానికి పెద్దఎత్తున రైతులు చేరుకుని పాస్‌బుక్‌లను వరుసలో పెట్టారు. అందరికీ దొరకకపోవడంతో మిగతా రైతులు ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు.

● కుకునూరుపల్లిలో యూరియా టోకెన్లు ఇవ్వడం లేదని తెలియడంతో రైతులు రాజీవ్ రహదారిపై ధర్నాకు దిగారు. అధికారులు జోక్యం చేసుకుని మంగళవారం పంపిణీ చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు.

● కొండపాకలో యూరియా రాక ఆలస్యం కావడంతో రైతులు రాజీవ్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. అధికారులు టోకెన్లు ఇచ్చి యూరియా పంపిణీ చేయడంతో ఆందోళన విరమించారు.

● రాయపోల్‌లో పంటలకు సమయానికి యూరియా వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు ధర్నా చేపట్టారు. దీంతో గజ్వేల్ - రామాయంపేట రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. అధికారులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

● మనోహరాబాద్‌లో ఐదు రోజుల క్రితం తీసుకున్న టోకెన్లకు కూడా యూరియా అందకపోవడంతో ఆగ్రహించిన రైతులు జాతీయ రహదారి 44ను ముట్టడించారు. సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. అధికారులు యూరియా తెప్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

● రామాయంపేటలో యూరియా నిల్వలు లేకపోవడంతో మహిళా రైతులు రామాయంపేట - మెదక్ రహదారిపై బైఠాయించి గంటపాటు రాస్తారోకో చేశారు. పక్షం రోజులుగా ఈ సమస్య ఎదుర్కొంటున్నామని వాపోయారు. పోలీసులు, అధికారులు నచ్చజెప్పడంతో ధర్నా సద్దుమణిగింది.

● చిన్నశంకరంపేట మండలంలో టోకెన్ల కోసం రైతులు క్యూలో గంటలతరబడి వేచిచూశారు. మడూర్ సహకార సంఘం వద్ద ఒక రైతు అవస్థకు గురై కిందపడ్డాడు.

● తూప్రాన్‌లో వారం రోజులుగా యూరియా పంపిణీ జరగకపోవడంతో రైతులు రైతు వేదిక వద్దకు పెద్దఎత్తున వచ్చారు. ఒక లారీ లోడ్ మాత్రమే అందుబాటులో ఉండగా, మిగతావి బుధవారం వస్తాయని అధికారులు చెప్పడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు.

● శివ్వంపేటలో సుమారు 1500 మంది రైతులు ఐదు గంటల పాటు వేచి చూసి నిరాశ చెందారు. కేవలం ఒక లారీ యూరియా మాత్రమే వచ్చిందని, మిగతావి మంగళవారం పంపిణీ చేస్తామని పీఏసీఎస్ సీఈవో చెప్పడంతో రైతులు నిరసన తెలిపి వెనుదిరిగారు.

● చేగుంటలో 600 బస్తాల యూరియా అందుబాటులోకి రావడంతో అధికారులు, పోలీసులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు పంపిణీ చేశారు.

● నర్సాపూర్ మండలంలో కూడా రైతులు యూరియా కోసం సహకార కార్యాలయాల వద్ద బారులు తీరారు. టోకెన్లు ఉన్నా యూరియా అందక ఇబ్బందులు పడ్డారు.

● సంగారెడ్డి జిల్లాలో అంతగా యూరియా కొరత లేదు. కంది పరిధిలో మాత్రం ఇబ్బందులు తలెత్తాయి. కంది పీఏసీఎస్‌కు సోమవారం లోడ్ యూరియా దిగుమతి కాగా, ఉదయం 8 గంటల నుంచే రైతులు క్యూ కట్టారు. రైతుకు 2 బస్తాల చొప్పున పంపిణీ చేశారు. గంటల తరబడి నిరీక్షించిన సరిపడా యూరియా అందక ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాల్లో రూ.50 బస్తాకు అదనంగా చెల్లించి కొనుక్కునూనే దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోయారు.





జగదేవ్‌పూర్‌లో రోడ్డుపై బైఠాయించిన రైతులు, రామాయంపేటలో ధర్నా చేస్తున్న మహిళలు, మనోహరాబాద్ ఎన్‌హెచ్44పై రైతులు, తూప్రాన్‌లో రైతువేదిక వద్ద అన్నదాతలు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అర్జీదారుల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. జటిలమైన సమస్యల పరిష్కారానికి గడువు నిర్ధేశించి ప్రజలకు జవాబుదారీగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమాహారతి, అదనపు కలెక్టర్ మాధురి, డీఆర్‌వో పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి : సంగారెడ్డి ఎస్పీ పరితోష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోలీసు శాఖ ప్రజలకు మరింత చేరువయ్యేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని తక్షణమే పరిష్కరించే విధంగా సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలతో మాట్లాడారు. ప్రజల సమస్యలను సత్వర పరిష్కారమే ధ్యేయంగా పోలీసు శాఖ పనిచేస్తుందని అన్నారు. జిల్లా ప్రజల సమస్యలకు స్థానికంగా పరిష్కారం దొరకని పక్షంలో మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, ఎలాంటి పైరవీలకు తావు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలని ఆయన కోరారు.


అర్జీలు స్వీకరిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

బాధితులకు న్యాయం చేయాలి : మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి 9 ఫిర్యాదులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకొని నెల రోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని ఎస్పీ తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

● సిద్దిపేట కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సిద్దిపేట కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వారి సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యల పరిష్కారానికి 174 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లా అధికార యంత్రాంగంపై విశ్వాసంతో ప్రజావాణి కార్యక్రమం ద్వారా తమ సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు దరఖాస్తులను అందజేస్తున్నారని తెలిపారు. వాటిని ఆయా శాఖ అధికారులు ప్రత్యేకంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రహమాన్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముహూర్తం ఖరారు

● 4న మెడికల్ కాలేజీ, క్రిటికల్ కేర్, క్యాన్సర్ వార్డు ప్రారంభం
● రూ.273.40 కోట్లతో 500 పడకల ఆస్పత్రికి శంకుస్థాపన
● ఏర్పాట్లు పరిశీలించిన అదనపు కలెక్టర్, అధికారులు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో ఈ నెల 4వ తేదీన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పలు అభివృద్ధి, ప్రారంభోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఏర్పాట్లను మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రకాశ్‌రావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణలతో కలిసి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, టీజీఎంఎస్ఐడీసీ అధికారులు సోమవారం పరిశీలించారు.

రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్

సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో రూ.23.75 కోట్ల వ్యయంతో 50 పడకల క్రిటికట్ కేర్ విభాగాన్ని నిర్మించారు. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో జీ+2 సామర్థ్యంలో నిర్మించిన ఈ భవనాన్ని మంత్రి తొలుత ప్రారంభిస్తారు. ఆ తర్వాత జీజీహెచ్‌లోని పాలియేటివ్ కేర్ వార్డులోని ఏర్పాటు చేసిన 10 పడకల క్యాన్సర్ డే కేర్ సెంటర్‌ను మంత్రి ప్రారంభిస్తారు.

రూ.156 కోట్లతో మెడికల్ కాలేజీ భవనాలు

ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణంలో భాగంగా రెండో విడతలో ఆర్‌అండ్‌బీ శాఖ రూ.156 కోట్ల నిధులతో మెయిన్ బ్లాక్(జీ+2), బాలుర హాస్టల్(జీ+7), బాలికల హాస్టల్(జీ+8), బాలుర రెసిడెంట్ హాస్టల్(జీ+2), ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ క్వార్టర్స్ జీ+3, నూతన మార్చురీ భవనాలు నిర్మించారు. వాటితో పాటు మెడికల్ కాలేజీకి అనుబంధంగా టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో రూ.273.40 కోట్లతో నిర్మించనున్న 500 పడకల ఆస్పత్రికి మంత్రి దామోదర్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో వైద్య విద్యార్థుల నుద్దేశించి మంత్రి ప్రసంగించనున్నారు. కొంతకాలంగా ప్రారంభోత్సవాలు వాయిదా పడుతూ రావడం, పైగా స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రారంభోత్సవ ముహూర్తం ఖరారు కావడంతో ఉత్కంఠకు తెరపడింది.





మెడికల్ కాలేజీ పరిపాలన భవనం, క్రిటికల్ కేర్ బ్లాక్

దశాబ్దాల నిరీక్షణకు తెరపడేదెన్నడో..?

● కొలిక్కిరాని ఐడీఎస్ఎంటీ ప్లాట్ల సమస్య ● హామీలు, ప్రతిపాదనలకే పరిమితం


ఐడీఎస్ఎంటీ కోసం కేటాయించిన స్థలం



జహీరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో 1982లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన ఐడీఎస్ఎంటీ (ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ స్మాల్ అండ్‌మీడియం టౌన్‌షిప్) ప్లాట్ల సమస్య నాలుగు దశాబ్ధాలుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. 'చేస్తాం, అవుతుంది'.. అంటూ అధికారులు, నాయకులు ఇస్తున్న హామీలు, తయారుచేస్తున్న ప్రతిపాదనలు ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్లాట్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు.

101 ఎకరాల్లో 1,294 ప్లాట్లు

1982లో హౌసింగ్ బోర్డుకు అనుకుని ఉన్న 101 ఎకరాల ప్రభుత్వ భూమిలో 1294 ప్లాట్లను ఏర్పాటు చేశారు. ఇందులో 1,115 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసేందుకు సిద్ధం చేశారు. ఈడబ్ల్యూఎస్, ఎల్ఐజీ, ఎంఐజీ, హెచ్ఐజీ అనే కేటగిరీల కింద అర్హులను గుర్తించి నామమాత్రపు ఫీజులతో 1987 నుంచి 2009 వరకు పంపిణీ ప్రక్రియ చేపట్టారు. ఇందులో భాగంగా ఈడబ్ల్యూఎస్ రూ.5వేలు (110 గజాలు), ఎల్ఐజీ రూ.15 వేలు (260 గజాలు), ఎంఐజీ రూ.16,500 (300 గజాలు), హెచ్ఐజీకు రూ.21వేలు (360 గజాలు) ఫీజులు నిర్ణయించారు.

కోర్టు వివాదంతో నిలిచిపోయిన ప్రక్రియ

నిబంధనలకు విరుద్ధంగా అనర్హులకు ప్లాట్లు కేటాయించారంటూ కొందరు 2009లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. 2013లో కోర్టు తీర్పు వెలువడుతూ, నిబంధనలకు విరుద్ధంగా కేటాయించిన ప్లాట్లను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. దీంతో అధికారులు సర్వేలు నిర్వహించి నివేదికను ప్రభుత్వానికి పంపారు. కానీ, అప్పటి నుంచి ఈ వ్యవహారం అడుగు ముందుకు పడలేదు.

ఎన్నికల బ్రేక్.. కొత్త ప్రభుత్వంపై ఆశలు

గతంలో లబ్ధిదారుల సమస్యను పరిష్కరించాలని మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్ అధికారులను ఆదేశించారు. అయితే, ఆ సమయంలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో పంపిణీ ప్రక్రియకు బ్రేక్ పడింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరిస్తుందని లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం సుమారు 300 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ, వారికి మౌలిక సదుపాయాలు కరువయ్యాయి.

102 ప్లాట్లకు డబుల్ రిజిస్ట్రేషన్లు



ఐడీఎస్ఎంటీలో 102 ప్లాట్లకు సంబంధించి డబుల్ రిజిస్ట్రేషన్లు ఉన్నాయి. ఈ సమస్యపై పూర్తిస్థాయిలో సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదించాం. వారి ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ చేపడతాం అని స్పష్టం చేశారు.
- సుభాష్‌రావు, మున్సిపల్ కమిషనర్

న్యూస్ బాక్స్

ఉపరాష్ట్రపతి అభ్యర్థి పరిచయ కార్యక్రమంలో ఎమ్మెల్యే



సీఎంతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో సోమవారం ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పరిచయం, గెలుపు కృషి కోసం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్సీలు, సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి పాల్గొన్నారు. పరిచయం అనంతరం సుదర్శన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.

చెరువును కాపాడాలని వినతి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి గ్రామంలోని తాళ్ల చెరువులో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వెంచర్ వేసేందుకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఆక్రమిస్తున్నారని, చెరువును కాపాడాలని మత్స్యకారుల కో ఆపరేటివ్ సొసైటీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. చెరువుకు సంబంధించి హద్దు బద్దులతో పాటు సర్వే నంబర్‌తో కూడిన మ్యాప్ ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు.

నారింజ ప్రాజెక్టును సందర్శించిన ఇరిగేషన్ ఎస్ఈ

జహీరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కొత్తూర్(బి)గ్రామంలో గల నారింజ ప్రాజెక్టును ఇరిగేషన్ పర్యవేక్షక ఇంజనీర్ పోచమల్లు సోమవారం సందర్శించారు. ప్రాజెక్టు పరిస్థితి, నిర్మాణ సమయం, నీటి నిల్వ సామర్థ్యం, తదితరాల గురించి ఇరిగేషన్ అధికారి విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. 5 దశాబ్దాల క్రితం నిర్మించిన ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరముందని, అందుకు అవసరమగు ప్రతిపాదనలు సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపించామన్నారు.

పోలీస్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన

వట్‌పల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వట్‌పల్లి పోలీస్‌స్టేషన్ భవనం ఏర్పాటు కోసం వట్‌పల్లి, గొర్రెకల్ శివారులో మూడు ప్రాంతాలను డీఎస్పీ సత్తయ్య సోమవారం స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించి, మాట్లాడారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. తహసీల్దార్ చంద్రశేఖర్, జోగిపేట సీఐ అనిల్, ఎస్ఐ లవకుమార్ పాల్గొన్నారు

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం : ఎంఈవో

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మానసికోల్లాసానికి క్రీడలు దోహద పడుతాయని సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్ అన్నారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం నిర్వహించారు. మూడురోజుల పాటు జరగనున్న క్రీడలను ఎంఈవో విద్యాసాగర్ ప్రారంభించారు.

క్రీడాపోటీలు ప్రారంభం

మునిపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలలో మండలస్థాయి 69వ క్రీడాపోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఎంఈవో భీంసింగ్ ప్రారంభించారు. వాలీబాల్‌లో (అండర్-14, 17) బాలురు, బాలికలకు పోటీలు నిర్వహించినట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తా

కల్హేర్/సిర్గాపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ ట్రాన్స్‌కో సబ్ డివిజన్ ఏడీఈ నాగిరెడ్డి అన్నారు. సిర్గాపూర్ మండల పరిధిలోని కడ్పల్‌లో ఆదివారం రైతులు ఆందోళన చేసిన విషయం విధితమే. దీనికి స్పందించిన ఏడీఈ సోమవారం కడ్పల్ గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో ఇబ్బంది లేకుండా నిర్ణీత సమయం ప్రకారం సరఫరా చేస్తామని, రాత్రివేళల్లో మార్పు గురించి లోడ్ మానిటరింగ్ సెల్(ఎల్ఎంసీ) ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తామన్నారు.

నాటిన ప్రతీ మొక్కను రక్షించుకోవాలి

చేగుంట సెప్టెంబరు 1 : నాటిన ప్రతీ మొక్కను రక్షించాలని రామాయంపేట ఎక్సైజ్ ఎస్సైలు విజయ సిద్ధార్థ, హరీష్, గ్రామ గౌడ సంఘం నాయకులు అన్నారు. వన మహోత్సవంలో భాగంగా వడియారం శివారులో వారు ఈత మొక్కలు నాటి మాట్లాడారు. వన మహోత్సవంలో నాటిన ప్రతీ మొక్క బాధ్యత గౌడ కులస్తులదని చెప్పారు.

బీసీ 42 శాతం రిజర్వేషన్లు చరిత్రాత్మకం

- టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి
- సంగారెడ్డిలో సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు





కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్‌కుమార్‌కు మిఠాయి తినిపిస్తున్న నిర్మలాజగ్గారెడ్డి, నిర్మలాజగ్గారెడ్డికి స్వీట్లు తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం అసెంబ్లీలో బిల్లుకు ఆమోదం పొందిన సందర్భంగా సంగారెడ్డిలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. అనంతరం పెద్దఎత్తున బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించిందన్నారు. ఇది చరిత్రాత్మక బిల్లు అని, ఈ బిల్లు ద్వారా బీసీలు అన్నిరంగాల్లో ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. బిల్లుకు ఆమోదం తెలిపినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు కూన సంతోష్‌కుమార్, జార్జ్, మహేష్, కిరణ్ గౌడ్, సత్యనారాయణ, రాంరెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. పాఠశాలకు వెళ్లేదెలా..!



బురదమయంగా మారిన రహదారి నుంచి పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

జిన్నారం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జిన్నారం మండలం గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి బురదమయంగా మారింది. దీంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు నిత్యం ఇక్కట్లు పడుతున్నారు. గడ్డపోతారం గ్రామ శివారులో ఉన్న ప్రాథమిక పాఠశాలకు 75 మంది వెళ్తారు. ఇటీవల కురిసిన వర్షాలతో ప్రధాన రహదారి నుంచి పాఠశాల వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తి బురదమయంగా మారింది. ఆ రహదారిపై నడిచి వెళ్తూ విద్యార్థులు జారిపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి బురదమయంగా మారిన రోడ్డును బాగు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కుట్రలో భాగమే కాళేశ్వరంపై రాద్ధాంతం

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సునీతారెడ్డి

నర్సాపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ కలిసి తెలంగాణలో బీఆర్ఎస్‌ను నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగమే కాళేశ్వరం ప్రాజెక్టుపై లేనిపోని రాద్ధాంతం చేస్తూ సీబీఐ విచారణకు సూచించారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. సోమవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు ఒక జలసిరి అని, రైతులకు కల్పతరువని ప్రపంచస్థాయిలో మెచ్చుకున్నారని, అలాంటి ప్రాజెక్టుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కేసీఆర్‌ను బద్నాం చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఘోష్ కమిషన్ వేసి చేయని వాటిని తప్పులుగా చూపి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ బలమైన శక్తిగానే ఉంటుందని సునీతారెడ్డి అన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, మాజీ;వైస్ చైర్మన్ నయిమోద్దిన్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శేఖర్, భిక్షపతి పాల్గొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపై అసత్య ప్రచారం సహించం



మెదక్ చేగుంట రహదారిపై రాస్తారోకో చేస్తున్న పద్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై చేసిన అసత్య వ్యాఖ్యలను సహించమని మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. ఆదివారం అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యత లోపించిందని అసత్య ప్రచారాలు చేశారన్నారు. అసత్య ప్రచారాలకు నిరసనగా సోమవారం ఆమె ఆధ్వర్యంలో చిన్నశంకరంపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి అమరవీరుల స్థూపానికి కాళేశ్వరం జలాలతో జలాభిషేకం చేశారు. అనంతరం మెదక్-చేగుంట రహదారిపై గంటపాటు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్ దేశానికే ఆదర్శమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకుని తొలగించారు. గంటపాటు ధర్నా చేయడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఇదిలా ఉండగా ఆందోళనకారులను ఎస్ఐ నారాయణగౌడ్ సముదాయించే క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పద్మారెడ్డి, శశిధర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్లు మల్లికార్జున్‌గౌడ్, పల్లె జితేందర్‌గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ధర్నాలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్, మాజీ సర్పంచులు, సొసైటీ చైర్మన్ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాలు నేర్పించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళిఘణపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు కనీస అభ్యాసన సామర్థ్యాలు నేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం మండలంలోని డైట్ కళాశాలలో ఎంఈవోలు, విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ అమలులో ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులదే కీలకమన్నారు. పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషిచేయాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల ముఖహాజరు సరిగా చేయాలన్నారు. ఎంఈవోలు, కాంప్లెక్స్ హెచ్ఎంలు పాఠశాలలను సందర్శించినప్పుడు 35 నిమిషాల సమయం కేటాయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, అధికారులు నవీన్, రాజు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు పాల్గొన్నారు.

నూతన పురపాలికలకు శాశ్వత భవనాలు



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా ఏర్పడిన పురపాలికలకు శాశ్వత భవనాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పటాన్‌చెరు క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇంద్రేశం, ఇస్నాపూర్, జిన్నారం, గుమ్మడిదల, గడ్డపోతారం మున్సిపాలిటీలకు నూతన భవనాలు నిర్మిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. బంధంకొమ్ము, ఉస్మాన్‌నగర్‌లో నిర్మించిన రిజర్వాయర్లను ఈనెల 10న ప్రారంభించనున్నామని వివరించారు. తెల్లాపూర్, అమీన్‌పూర్ పురపాలికల్లో తాగునీటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. గుమ్మడిదల నుంచి కానుకుంట వరకు రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నామని అన్నారు. ఇస్నాపూర్‌లో శాశ్వతంగా డంపింగ్ యార్డు సమస్య పరిష్కరిస్తామని అన్నారు.

వరద బాధితులకు అండగా ఉంటాం



రాజిపేటలో మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న మల్లేష్ గౌడ్

హవేళిఘణపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితులకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అండగా ఉంటారని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని గాజిరెడ్డిపల్లి, భూర్గుపల్లి, కప్రాయిపల్లి, దూప్‌సింగ్ తండాలో వరదల వల్ల నష్ట వాటిల్లిన పంటలను పరిశీలించారు. అలాగే రాజిపేట గ్రామంలో వరదల వల్ల చనిపోయిన సత్యనారాయణ, యాదాగౌడ్ కుటుంబీకులను పరామర్శించి, మనోధైర్యాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత రైతులకు ఏ సమస్య వచ్చినా ఎంపీ వెన్నంటి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

రైతులకు రూ.40 వేల పరిహారం ఇవ్వాలి

పాపన్నపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు పాపన్నపేట మండలంలోని చాలా గ్రామాల్లో పంటలు నష్టపోయిన రైతులకు రూ.40 వేల పరిహారం అందించాలని బీజేపీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం ఎంపీ రఘునందర్‌రావు ఆదేశాల మేరకు బీజేపీ మండల నాయకులతో కలిసి ఎల్లాపూర్, పొడ్చన్‌పల్లి, కొత్తపల్లి, కుర్తివాడ, ఆరేపల్లి, పాపన్నపేట, ముద్దాపురం, రాంతీర్థం, మల్లంపేట, కొత్తలింగయ్యపల్లి, చీకోడ్, కొంపల్లి, నార్సింగ్‌బాచారం గ్రామాల్లో పంటలను పరిశీలించారు. సత్యనారాయణ మాట్లాడుతూ పంట నష్ట నివారణ చూస్తే కళ్లకు నీళ్లు వస్తున్నాయని బాధను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు బీ.కొండరాములు, మండల సీనియర్ నాయకుడు శంకరన్న, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

'మంజీర' ఉగ్రరూపం

(5వ పేజీ తరువాయి)

మండలంలోని అనేక గ్రామాలలో వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. వరద నీరు ఇంకా పొలాల్లోనే నిలిచి ఉండటంతో వరి పైరు దెబ్బతింటోంది. కొన్నిచోట్ల పొలాల్లో ఇసుక మేటలు, బురద పేరుకుపోయి పంట నాశనమైంది. రైతులు తమ శ్రమ, డబ్బు నీటిపాలైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద నష్టంపై వేగంగా అంచనాలు

టేక్మాల్/పెద్దశంకరంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాల వల్ల కలిగిన నష్టాలపై అంచనాలు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులకు యుద్ధ ప్రాతిపదికన తాత్కాలిక మరమ్మతులు చేపట్టి రవాణాను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. పంట నష్టాన్ని కూడా అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. వరద సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు పలువురు రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు వచ్చేనా?

(5వ పేజీ తరువాయి)

ట్రాక్టర్లలో డీజిల్, పంపుసెట్ల మరమ్మతులు, పైపులైన్ల ఏర్పాటు, విద్యుత్ దీపాల నిర్వహణ, తాగునీటి సమస్య పరిష్కారం కోసం డబ్బులు ఖర్చు చేశారు. ఇందుకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో రూ.28.25 కోట్లు ఖర్చు చేశారు. అయితే సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన తర్వాత గ్రామ పంచాయతీల్లో కొత్త పాలకవర్గాల ఎన్నికలు జరపకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. గ్రామాల అభివృద్ధి కోసం కార్యదర్శులు అప్పులు చేసి సమస్యలు పరిష్కరించినా బకాయిలు అందకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సంగారెడ్డిలో ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావణ్య పేర్కొన్నారు. సంగారెడ్డిలో పోటీ పరీక్షల ఉచిత శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అన్ని పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుపేదలకు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసినవారికి నాణ్యమైన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు అధ్యాపకులు చెప్పే విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతీ విషయంపై అవగాహన ఉన్నప్పుడే పోటీ పరీక్షల్లో విజయం సాధించగలరని సూచించారు. అభ్యర్థులు అన్ని విషయాల్లో నైపుణ్య సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలన్నారు. అభ్యర్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి జగదీష్, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ ఇనేష్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు పరిహారం ఇవ్వాలి

పుల్‌కల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సింగూరు కాలువల కింద దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు అతిమేల మాణిక్ డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులతో కలిసి సోమవారం పుల్కల్ మండలం మిన్‌పూర్ గ్రామ శివారులో సింగూరు ప్రధాన ఎడమ బ్రాంచి కెనాల్‌కు పడిన గండ్లను పరిశీలించారు. ఇసోజీపేట, బస్వాపూర్, మిన్‌పూర్ గ్రామాల శివారు ప్రాంతాల్లో సింగూరు కాల్వలకు పడిన గండ్లను వెంటనే మరమతు చేపట్టాలన్నారు. నీటి పారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతులకు తీరని నష్టం వాటిల్లిందని విచారం వ్యక్తం చేశారు.

తాగునీటి కోసం ధర్నా

కౌడిపల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాలుగురోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని మండలంలోని కొత్తచెరువుతండా గ్రామపంచాయతీలోని ధర్మసాగర్ గేట్‌తండా గిరిజనులు సోమవారం ఖాళీ బిందెలతో రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగురోజులుగా మిషన్ భగీరథ నీరు రాక తాగునీటి కోసం అవస్థలు పడుతున్నామని అన్నారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని సమస్య పరిష్కరిస్తామని హామీఇవ్వడంతో ధర్నా విరమించారు.

వృథాగా పోతున్న నీరు

శివ్వంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వారంరోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు మండల పరిధి చండి గ్రామంలోని కుమ్మరి కుంట తూములోంచి నీళ్లు వృథాగా పోతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు తెలిపారు. వృథాగా పోతున్న నీటితో కుంట సమీపంలోని నర్సింగ్, నాగులుకు చెందిన 20 గుంటల భూమి నీట మునిగిందన్నారు. అధికారులు స్పందించి తూముకు మరమ్మతులు చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

గండిపడిన బట్టికుంట పరిశీలన

అల్లాదుర్గం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అల్లాదుర్గంలోని బట్టికుంటకు గండిపడింది. సోమవారం మెదక్ ఆర్డీవో రమాదేవి కుంటను పరిశీలించారు. అంతకుముందే కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ నగేష్ కూడా కుంటను పరిశీలించిన విషయం తెలిసిందే. కాగా మరోసారి ఆర్డీవో పరిశీలించి, గండిని పూడ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తహసీల్దార్ మల్లయ్యకు సూచించారు.

వరద వల్ల నష్టపోయిన ప్రతీ ఒక్కరిని ఆదుకోవాలి : శశిధర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వచ్చిన వరద ముంపు వల్ల నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ వరద ముంపు వల్ల చనిపోయిన వారికి రూ.25 లక్షల చొప్పున పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. నీట మునిగిపోయిన పంటలకు ప్రతీ ఎకరానికి రూ.25 వేలు చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లల్లో కనీస వసతులు కరువయ్యాయని అన్నారు. అధికారులు స్పందించి డబుల్ బెడ్‌రూం రహదారులకు మరమ్మతులు చేయించాలని కోరారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



పెద్దశంకరంపేటలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సకాలంలో రైతులకు యూరియా సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం పెద్దశంకరంపేటలో పీఏసీఎస్ ఎరువుల దుకాణం వద్ద రైతులు తీరి ఉండడం గమనించి అక్కడికొచ్చి మాట్లాడారు. వ్యవసాయ అధికారులతో, సొసైటీ బాధ్యులతో మాట్లాడి ప్రజలకు ఇబ్బంది లేకుండా యూరియా అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీరమేష్, రైతుబంధు మాజీ అధ్యక్షుడు సురేష్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే పెద్దశంకరంపేటలోని మాధవ్‌నగర్ కాలనీలో ప్రతిష్టించిన వినాయకుడి వద్ద భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

నియోజకవర్గ స్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయండి

- కలెక్టర్‌తో మాట్లాడిన ఎమ్మెల్యే రోహిత్



పాపన్నపేట మండలం గాంధారిపల్లిలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

పాపన్నపేట, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గస్థాయిలో పంట నష్టాన్ని త్వరలో అంచనా వేసి నివేదిక తయారు చేయాలంటూ కలెక్టర్‌తో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు ఫోన్‌లో మాట్లాడారు. ఆదివారం గాంధారిపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన వరదల్లో నష్టపోయిన పంట పొలాలను పరిశీలించి, కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. పంట నష్ట అంచనాకు సంబంధించి నివేదికను అందించాలన్నారు. నివేదిక ఆధారంగా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతరం నాగ్‌సాన్‌పల్లికి చెందిన మాజీ సర్పంచ్ ఇటీవల మృతిచెందడంతో.. ఆమె దశ దినకర్మలో పాల్గొని, భూదేవి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె కుమారుడు, ఏడుపాయల మాజీ చైర్మన్ నర్సింలుగౌడ్‌తోపాటు కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోవింద్‌నాయక్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు భరత్‌గౌడ్ ఉన్నారు. కొంపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెలే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకులను నియమించాలి



ధర్మేంద్రప్రధాన్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు అధ్యాపకుల నియామకం చేపట్టాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి కోరారు. సోమవారం కంది ఐఐటీకి విచ్చేసిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. విద్యాలయాల్లో బోధనా సామర్థ్యాలు పెంపొందించాలని కోరారు. సర్వశిక్షా అభియాన్ కింద పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో నాణ్యమైన ఆడిట్ జరగడం లేదని వివరించారు. సమ్మక్కసారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ భవనాల నిర్మాణాలకు త్వరితగతిన నిధులు మంజూరుచేసి అధ్యాపక నియామకాలు చేపట్టాలని కోరారు.